
# బంగారు కొండ

'ధీర'



ఆ కొండకు దూరం నుండి నమస్కరించాలంతే! దాన్ని ఎక్కకూడదు. కా దని ఎక్కితే పతనం తప్పదు. ఆ 'కొండ' రహస్యం విప్పి చెప్పిన 'భగవద్గీత' ఇది.

ఆ ఊరికి కొండాపురం అని ఎందుకు పేరు వచ్చిందో ఆ ఊరి పొలిమేరల్లో అడుగు పెట్టిన ఎవరికైనా ఇట్టే అర్థ మయ్యిపోతుంది. "మా ఊరికి రండి" అంటూ ఆహ్వానిస్తూ ఆ ఊళ్లో అడుగు పెడుతున్న వారి నందరినీ పలకరిస్తున్నట్లే ఉంటుంది ఆ కొండ.

ఆ ఊళ్లో అడుగు పెట్టే ముందర ఆ కొండకు నమస్కారం చేసుకుని మరీ ముందరికి సాగడం అందరికీ ఆనవాయితీ. మొట్టమొదటి సారిగా నేను కాపరాని కెళ్తున్నప్పుడు ఆ ఊరి పొలిమేర చేరగానే అత్తగారు - "దణ్ణం పెట్టుకో!" అనడం తటస్థించింది.

ఎవరికో అర్థం కాక ఎదురుకుండా ఉన్న అత్తగారికే నమస్కారం చేశాను. దాని కావిడ నవ్వి- "నాకు దణ్ణాలు పెట్టే రోజులు చాలా ఉన్నాయి. అటు తిరిగి కొండకు దణ్ణం పెట్టుకో!" అంటూ కొండను చూపించారు.

అత్తగారు అన్న మాటలకు కొండవైపుకు తిరిగి దణ్ణం పెట్టుకోడానికి నేను ఎత్తిన చేతులు అలాగే ఉండిపోయాయి.

"చాలు, చాలు నీ దణ్ణాలు! ఇంటి కొచ్చేశాం. బండి దిగు" అన్న మా ఆడపడుచు మాటలకు తేరుకుని బండి దిగాను - మా ఆయనతో సహా ఇంట్లో ప్రవేశించడానికి.

** ** **

మా పుట్టింటి ఊరు మహా నగరం కాకపోయినా, ఓ మోస్తరు పెద్ద ఊరే నని చెప్పాలి. చిన్నప్పటి నుంచి పొద్దు పొడిచిన తర్వాతే లేవడం అలవాటు. ఆ తరువాత కాఫీ పడితే గానీ ఏ పనీ చేయబు ద్ధెయ్యదు. అటువంటిది కాపరాని కొచ్చిన మరునటి రోజు పొద్దున్నే "వదినమ్మోయి! ఇహ లేవాలి" అంటూ జబ్బ కుదిపింది పెద్ద ఆడపడుచు.

అంతటితో ఊరుకోక "నీదే ఆలస్యం. అందరం లేచాం" అని కూడా అంది.

ఒక్క క్షణం ఇ దేదో పొడు క లనిపించి కళ్లు నులుముకుని చూశాను. పక్కనే ఆయన లేరు. ఎదురుకుండా ఆడపడుచు మటుకు నేను లేస్తే కాని వదల నన్నట్లుగా కనిపించింది. పైగా ఇల్లంతా అప్పటికే సందడిగా ఉంది.

ఏదో విశేషం ఉంటే కాని, ఇంత తెల్లవారుజామునే లేవడం జరగ దనుకుని లేచేశాను. అప్పటికే అందరి స్నానాలు కూడా అయిపోయాయి. నేను కూడా తొందరగానే తయారయ్యాను.

అందరం పెరట్లో చేరాం. సూర్యు డప్పుడే ఉదయిస్తున్నాడు. ఊరి పొలిమేరల్లో ఉన్న కొండ కొన నుంచి సూర్యుడు తొంగి చూస్తున్నాడు. సూర్య కిరణాలు పడుతున్న ఆ కొండ శిఖరం మేలిమి బంగారంలా ధగధగా మెరిసిపోతోంది. ఇంటిల్లిపాదీ ఆ కొండ వైపు చూస్తూ "తల్లీ! మమ్మల్ని కాపాడు" అంటూ ఎంతో భయభక్తులతో ప్రార్థించారు. నేనూ అలాగే ప్రార్థించాను.

ఊరు ఊరంతా ప్రతి ఉదయం ఇలాగే ఆ కొండ వైపు తిరిగి ప్రార్థించుకుని మరీ దిన చర్య ప్రారంభిస్తా రని తెలిసి నాకు ఆశ్చర్య మేసింది. కొండెక్కి వెళ్లి దేవుణ్ణి ప్రార్థించడం చూశాను కాని, ఎక్కడో దూరంగా ఉన్న కొండను చూస్తూ ప్రతి రోజూ ప్రార్థించడం వింతగానే అనిపించింది.

ప్రతి ఉదయం ఇంట్లో అందరితోపాటే నేనూ కొండను ప్రార్థిస్తున్నా ఆ కొండను గురించి తెలుసుకోవా లన్న కుతూహలం మటుకు నాలో రోజు రోజుకీ పెరుగుతోంది.

ఓ రోజున ఇక ఉండబట్టలేక ఆయనతో- "ఏమండీ! ఇవాళ సాయంత్రం ఆ కొండెక్కి వద్దా మండీ!" అని అన్నాను.

నా వైపు ఆయన ఆశ్చర్యంగా చూశారు. కాసేపటికి ఓ చిరునవ్వు నవ్వి- "న న్నడిగితే అడిగావు కాని, ఇలా ఇం కెవరితోనూ అనకు" అన్నారు.

"అ దేమిటండీ! ఆ కొండ ఎక్కకూడదా?"

"ఎక్కకూడదు. దూరం నుంచి దణ్ణం పెట్టుకోడానికే ఆ కొండ. అంతే అది" అని కాస్త గంభీరంగానే అన్నారు ఆయన.

కొండను గురించి వివరాలు అడగా లనుకున్న నాకు భయం వేసి ఊరుకున్నాను.

ఆ కొం డంటే అందరికీ భక్తి,

ఆ కొండంటే అందరికీ భయం కూడాను.

ఆలోచించిన కొద్దీ కొండను గురించి ఎలాగైనా తెలుసుకోవా లనే పట్టుదల ఎక్కువయింది నాలో.

** ** **

పాలేరు రామయ్య పొద్దున్నే వచ్చి మా అందరితోపాటు కొండకు దణ్ణం పెట్టుకుని, ఉన్న నాలు గేదెలకు మేత వేసి, పాలు పిండి పాలాని కెళ్తాడు. దాదాపు అరవై సంవత్సరా లుంటాయి రామయ్యకు. రామయ్య గేదెలకు మేత పెట్టే సమయానికి రోజా పూలు కోస్తూ ఉంటాను. ఓ రోజు పూలు కోస్తున్న నాకు చటుక్కున మనసులో ఓ ఆలోచన మెదిలింది. పూల సజ్జను నింపుకున్న తర్వాత గేదెలకు ఇంకా మేత వేస్తున్న రామయ్యను పలకరిస్తూ, "రామయ్యా! పుట్టినప్పటి నుంచీ ఈ ఊళ్లోనే పెరిగావా?" అ నడిగాను.

రామయ్య నవ్వి, "నేనే కా దమ్మగారూ! మా నాయన, మా తాత ముత్తాత లందరూ ఈ ఊళ్లోనే పుట్టి పెరిగి పోవడం జరిగింది, తల్లీ!" అన్నాడు.

"అది సరే కాని, రామయ్యా! మనం రోజూ మొక్కుకుంటాం చూశావా - ఆ కొండను గురించి తెలుసా నీకు" అడిగాను.

రామయ్య నా వైపు ఆశ్చర్యంగా చూశాడు. ఓ చిరునవ్వి నవ్వి - "తెలుసు కానీండి, అమ్మగారూ! ఒక్క మాట! ఆ కొండ దగ్గర కెప్పుడూ ఎల్లబోకండి. దూరంగా ఉన్నంత కాలం ఆ బంగారు కొండ మనల్ని రక్షిస్తూనే ఉంటుంది" అన్నాడు.

"తప్పకుండా. రామయ్యా! ఎప్పుడూ పోను. కాని, నాకు కొండను గురించి నీకు తెలిసింది చెప్పాలి" అని మళ్లీ అడిగాను.

"అ దంతా ఓ కథ అమ్మగారూ! మా నాయన దగ్గర నుంచి నేను ఇన్నది మీకు చెప్తున్నా" అంటూ గేదెలకు తవుడు కలుపుతూనే చెప్పడం మొదలుపెట్టాడు.


** ** **

"మా తాత కాలంలో గురవయ్య స్వాములా రని ఓ స్వాములా రుండేవారు. ఆయన పుట్టు పూర్వోత్తరాలు ఎవరికీ తెలియవు. కాని ఆయనంటే ఈ ఊరి ప్రజలకు ఎక్కడ లేని భక్తి గౌరవం.

"గురువయ్య స్వామి ఒంటరిగా ఆ కొండ మీదే ఉండేవాడు. వారాని కోసారి మాత్రం భిక్షాటన చేసుకుని సాయంత్రం చల్లబడే వరకు ఓ చెట్టు కింద ఊళ్లోనే విశ్రమించి ఆ తర్వాత కొండ పైకి వెళ్లిపోయేవాడు.

"గురవయ్య స్వామి కొండ దిగి వచ్చే రోజు కోసం ఊరి జనం అంతా తహతహ లాడిపోతూ ఎదురు చూసేవారు. ఊళ్లో ఎవరి కే కష్టం వచ్చినా ఆ గురవయ్య స్వామితో విధిగా చెప్పుకోవాల్సిందే. ఎవరు వచ్చి ఏ గోడు మొరపెట్టుకున్నా సరే, ఎంతో శ్రద్ధతో విని తనకి నచ్చిన సలహా మాత్రం చెప్పేవాడు. ఆ సలహాలతో కొండంత ధైర్యం కలిగేది ప్రజలకు. అందుకనే గురవయ్య స్వామి అంటే ఊ రందరికీ అపరిమితమైన భక్తి శ్రద్ధలు" అంటూ రామయ్య ఆ రోజుకి కథ ఆపి, "ఇవ్వాల్టికి టైమయిపోయిం దమ్మగారూ! ఆ కొండ దయ తలిస్తే రేపు చెప్పుకుందాం. పొలాని కెళ్లాలి" అంటూ లేచి వెళ్లిపోయాడు.

"ఏమే, అమ్మాయి! పూలు కోయడం కాలేదా ఇంకా"





అంటూ లోపల నుంచి అత్తగారి మాటలు వినిపించేటప్పటికి నేనూ లోపల కెళ్లిపోయాను.

కథ మధ్యలో ఆగిపోయినందుకు నాకు విచారం వేసింది. ఆ రోజు గడిచి, తెల్లవారి మళ్లీ పాలేరు రామయ్య ఎప్పుడు కనిపిస్తాడా అన్న ఆలోచనలో మునిగిపోయాను. ఆ రాత్రి కంటి మీద కునుకు లేదు. ఎలాగయితే నేం, రాత్రి గడిచి సూర్యోదయ మయింది. అందరం రోజూమాదిరే, ఆ రోజు కూడా కొండకు దణ్ణం పెట్టుకున్న తర్వాత నేను పూల కోసం వచ్చినట్లు వచ్చి గేదెలకు మేత వేస్తున్న రామయ్యకు జ్ఞాపకం చేశాను కథ గురించి.

మళ్లీ మొదలెట్టాడు రామయ్య.

"రోజు లన్నీ ఒకలా ఉంటాయటండీ, అమ్మగారూ! అందులో అసలే ఇది కలియుగం. పట్టణం చదువు నేర్చుకుని వచ్చిన ఇద్దరు ముగ్గురు గురవయ్య స్వామి మీద లేనిపోని అనుమానాలు లేవదీశారు. ఆ అనుమానాలు మెల్లగా కొందరి పెద్దల మనసుల్లో కూడా చోటు చేసుకున్నాయి. ఆ కొండ మీద ఏవో బంగారు నిధి నిక్షేపాలు ఉండి ఉంటా యనే వదంతిని ఊరంతా ప్రచారం చేశా రెవరో. కాని ఆ పరిస్థితి అలా కొనసాగడం ఊరికే క్షేమం కా దనుకుని కొందరు పెద్దలు ఆ విషయం గురవయ్య స్వామితోనే చర్చించటం



ముందే

"యుద్ధం జరుగుతున్నపుడు పారిపోయి రావటానికి సైనికునిగా నీకు సిగ్గు వెయ్యటం లేదూ?" అడిగాడు రామారావు మిలటరీలో పనిచేసిన స్నేహితుడు వెంకట్రావును.

"నేనేం యుద్ధం జరుగుతున్నప్పుడు పారిపోయి రాలేదు. యుద్ధానికి ముందే వచ్చేశాను" సంజాయిషీ ఇచ్చుకున్నాడు వెంకట్రావు.

కోగంటి మురళీకృష్ణ [ఒంగోలు]

బావుంటుం దనుకుని మరునటి రోజు గురవయ్య స్వామి చెట్టు కింద సేద తీర్చుకుంటున్న వేళ ఆయనతో సవినయంగా -

"స్వామీ! ఆ కొండ మీద ఏదో మహత్తరమైన శక్తి ఉందని ప్రజ లందరూ అనుకుంటున్నారు. అందుకనే మీ వెంట ..." అంటూ వాక్యం పూర్తి చేసేలోగా గురవయ్య స్వామి ఓ చిరునవ్వు నవ్వి -

"అందుకనే నా వెంట కొండపైకి వచ్చి చూద్దా మనుకుంటున్నారు. అవునా?" అని అడిగాడు.

ఆ ఊరి పెద్ద సమాధానం చెప్పేలోగా గురవయ్య స్వామి మళ్లీ తనే మొదలెట్టి -

"ఇలా మీ రందరూ ఇటువంటి కోరిక వెలిబుచ్చే రోజు కోసమే నేను ఎదురు చూశాను. కొండ మీద శక్తి ఉం దని కాదు, అక్క డేవో బంగారు నిధులున్నా యనే మీ అందరి అనుమానం. అవునా?" అని అడిగాడు.

తమ మనసులో ఉన్న అనుమానం గురవయ్య స్వామికి తెలిసినందుకు సిగ్గుపడ్డారు పెద్దలు. వెంటనే క్షమాపణ కోరుకుందా మనుకున్నారు కాని, ఇంతలోనే గురవయ్య స్వామి మళ్లీ తనే మొదలెట్టాడు -


"నాతో కొండ మీదకు వచ్చి ఆ నిధి నిక్షేపాలు చూడా లనే కదా మీ కోరిక? దాని కేమిటి, తప్పకుండా రండి! ఎక్కడా దారి తప్పకుండా నేనే తీసుకుపోతాను నా వెంట" అన్నాడు.

ఆ వార్త ఊరు ఊరంతా గుప్పు మని పాకిపోయింది. ఆ కొండ మీద ఉండే నిధి నిక్షేపాలు కళ్లారా చూడటమే కాకుండా, వీలయితే సంచులు నింపుకుని రావచ్చు ననే కాంక్షతో ఆ కొండ ఎక్కడానికి ఊరి ప్రజ లందరూ ఒకరితో ఒకరు పోటీ పడటం ప్రారంభ మయింది.

ఎప్పుడు గురువయ్య స్వామి పిలుస్తాడో అనే ఆశతో ఊళ్లోని చంటిపిల్లలు తప్పించి అందరూ నిద్రాహారాలు మానుకుని, ఆ చల్లటి కబురు కోసం గురవయ్య స్వామినే స్మరిస్తూ ఇళ్ల వాకిళ్ల ముందే కాచుకుని కూర్చున్నారు.

ఆ పరిస్థితి గమనించిన ఊరి పెద్దలు ఓ రోజున గురవయ్య స్వామిని సమీపించి-

"స్వామీ! మీరు చెప్పిన విషయం విన్నప్పటి నుంచీ ఊరి జన మంతా కొండ ఎక్కడానికపోటీలు పడి మరీ సిద్ధ మవుతున్నారు. అందరూ పల్లకి ఎక్కా




లనుకున్నట్లే అందరూ కొండ ఎక్కితే ఇక ఊళ్లో ఉండే దెవరు స్వామీ! కాబట్టి మీ వెంట ఎంతమందిని తీసుకెళ్లాలో, ఎవరిని తీసుకువెళ్లాలో మీరే నిర్ణయించండి" అని ప్రాథేయపడ్డారు.

వారి అవస్థ నర్థం చేసుకున్న గురవయ్య స్వామి "అలాగే కానీయండి. అంతే కాదు, మరి నా వెంట వచ్చేవారిలో ఎవరిని ఎంత దూరం కొండ మీదకు తీసుకెళ్లాలో కూడా నేనే నిర్ణయించవలసి వస్తుంది. నా వెంట ఎంతమంది వచ్చినా కొండ ఎత్తుకు నాతో ఒక్కరినే తీసుకెళ్లగలను. మరి మీ ఇష్టం" అన్నాడు.

ఆ మాటలు విన్న ఊరి పెద్ద - "స్వామీ! అంతా మీ దయ! పూర్తిగా మీ నిర్ణయానికే లోబడి ఉంటుంది ఈ ఊరంతా" అని గురవయ్య స్వామికి హామీ ఇచ్చాడు.

ఏ రోజు కోసం ఆ ఊరి జన మంతా ఆత్రతగా ఎదురు చూస్తూ ఉన్నారో ఆ రోజు రానే వచ్చింది.

ఊరి పెద్దలతోపాటు గురవయ్య స్వామి ముందు జనం అంతా ఎంతో భక్తి శ్రద్ధలతో కూర్చుని ఉన్నారు. గురవయ్య స్వామితోపాటు కొండ ఎక్కే అదృష్టం ఎవరికి కలుగుతుందా అని తర్కించుకుంటున్నారు. ఇంతలో గురవయ్య స్వామి కళ్లు తెరిచి, కూర్చున్న జనం వైపు చూసి చిరునవ్వు నవ్వి ఓ తొమ్మిది మందిని పేరు పేరునా పిలిచి "వీరు నా వెంట కొండకు వస్తారు. మీ కందరికీ అంగీకారమే నని అనుకుంటున్నాను" అంటూ పెద్దల వైపు చూశాడు గురవయ్య.

"మీ రెవరిని తీసుకెళ్లినా మా కిష్టమే, స్వామీ!" అన్నారు పెద్ద లందరూ.

అలా ఎన్నుకున్న తొమ్మిదిమందీ గురవయ్య స్వామి పాదాలకు నమస్కారం చేయబోతే వారిని వారించి, గురవయ్య మళ్లీ పెద్దల వైపు తిరిగి - "ఈ తొమ్మిది మందిలో కొండ పూర్తి ఎత్తుకు నాతోపాటు చేరుకోగలిగేది ఒక వ్యక్తి మాత్రమే" అని అన్నాడు.

"అంతా మీ దయ! మీదే భారం" అన్నారు పెద్దలు.

వెంటనే గురవయ్య స్వామి ఎన్నికైన తొమ్మిదిమందినీ ఉన్నపళంగా కట్టుబట్టలతో రమ్మని ఆదేశించాడు. వారి క్కావలసిన నదుపాయా లన్నీ తను చూడగలనని హామీ ఇవ్వడంతో ఆ తొమ్మిది మందీ ఏ మాత్రం సంకోచం లేకుండా గురవయ్య స్వామితో బయలుదేరారు.

మరునటి రోజు సాయంత్రానికి గురవయ్య స్వామితో బయలుదేరిన తొమ్మిదిమందిలో ఇద్దరు గ్రామానికి వచ్చారు. కొండ ఎక్కడం అలవాటు లేని కారణంగా అలసిపోయి వీ రిద్దరూ తిరిగి వచ్చేసి ఉండవచ్చు ననుకున్నా రా ఊరి జనం. కాని, ఆ ఇద్దరు వ్యక్తులు చెప్పినదాన్ని బట్టి గురవయ్య స్వామే వారితో "ఇంతవరకూ మీరు ఎక్కింది చాలు, మీ రిక దిగి వెళ్లిపొండి" అన్నట్లు తేలింది. వారి మంచి కోరే గురవయ్య స్వామి అలా చెప్పి ఉంటా డనుకుని తృప్తి పడ్డా రందరూ.

మరునటి రోజు సాయంత్రానికి మరో ఇద్దరు వ్యక్తులను కూడా గురవయ్య స్వామి తిరిగి పంపించేశాడు. మరునటి సాయంత్రం కూడా అదే విధంగా మరొక ఇద్దరు కొండ దిగి తిరిగి వచ్చారు. ఎవరినో ఒకరినే తన వెంట కొండ కొన వరకూ తీసుకెళ్ల గలననే గురవయ్య మాటలు జ్ఞప్తికి తెచ్చుకుని సంతృప్తి చెందారు ఆ ఊరి జనం.

కాని నాలుగో రోజు మరో ఇద్దరు తిరిగి రావడంతో దిగ్భ్రాంతు లయ్యారు ఊరి జన మంతా. గురవయ్య స్వామితో సహా మిగిలింది ఒక్కడే వ్యక్తి. అతనే ఆశయ్య. ఆ ఆశయ్యనే కొండ కొనకు తీసుకెళ్లడానికి గురవయ్య స్వామి నిర్ణయించుకున్నా డని నిర్ధారణ అయింది. అందుకే ఊరి జనం అంతా నమ్మలేకుండా ఉన్నారు ఆ విషయాన్ని.

ఆశయ్యను గురించి ఊళ్లో తెలియని ప్రాణి అంటూ లేదు. మోసానికే మారు పేరు ఆశయ్య. స్వార్థం కోసం ఎటువంటి అకృత్యానికైనా వెనుతీయడు. అటువంటి ఆశయ్యను గురవయ్య స్వామి తనతో కొండ పైకి చేర్చటానికి నిశ్చయించుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

అందుకే ఈ విషయంలో రకరకాల అనుమానాలు బయలుదేరాయి ఊళ్లో. కొండ మీద నిజంగానే బంగారు నిధి నిక్షేపాలు ఉండి ఉంటా యని కొందరూ, అంతే గాకుండా ఆశయ్య, గురవయ్యలు ఆ నిధి నిక్షేపాలు పంచుకోడాని కేదో అంగీకారం కుదుర్చుకుని ఉంటా రని మరికొందరూ - ఇలా ఎవ రిష్టం వచ్చినట్లు వాళ్లు అనుకోవడం ప్రారంభ మయింది. కాని ఊళ్లో వయసు మళ్లిన పెద్దలు మాత్రం ఆశయ్యను కొండ ఎక్కించడం గురవయ్య స్వామి ఏదో సదుద్దేశంతో చేసే కార్య మని భావించారు. పైగా గురవయ్య స్వామికి దురుద్దేశాలు అంటకట్టడం తీరని అపచార మని నమ్మారు కూడా.

ఏది ఎలా ఉన్నా ఆశయ్యను తీసుకుని గురవయ్య స్వామి కొండ దిగి వచ్చినప్పుడు విషయాలన్నీ అడిగి తెలుసుకోవచ్చని అంటూ ఊరి పెద్దలు ప్రజలను సముదాయించారు.

అందుకనే ప్రతిరోజు ఆశయ్య కోసం, గురవయ్య స్వామి కోసం ఆ ఊరి ప్రజలు కళ్లలో వత్తులు వేసుకుని చూస్తున్నారు. అలా వారం రోజులు గడిచినా ఆశయ్య కాని, గురవయ్య కాని తిరిగి రాలేదు. ఊళ్లో అందరికీ భయాందోళనలు కలగడంతోపాటు అంతకుముందే ఉన్న అనుమానాలు బలపడసాగాయి. కొండ మీద ఉన్న నిధి నిక్షేపాలు ఆ ఇద్దరూ పంచుకుని ఎవరికీ కనిపించకుండా ఆ ఊరు వదిలి వెళ్లిపోయి ఉంటారని చాలామంది బాహాటంగా చెప్పుకోవడం ప్రారంభ మయింది.

మరునటి రోజు మధ్యాహ్నం ఎవరో బండి మీద ఊరు కొండ పక్క నుంచే వస్తూండగా కుళ్లిపోయి, వాసన కొడుతున్న శవం కనిపించింది. వెంటనే బండిని తొందరగా నడిపించి ఆ బండిలో ఉన్న పెద్ద మనిషి ఆ వార్తను ఊరి పెద్దకు చేరవేయడంతో ఊరు ఊరంతా గుప్పు మని పాకిపోయింది. వెంటనే ఊరి పెద్దలతోపాటు సగం మంది జనం ఆ ప్రదేశం వైపు హుటాహుటిన బయలుదేరారు. అక్కడికి చేరుకోగానే నిజంగానే కనిపించింది కుళ్లిపోయిన ఓ మనిషి శవం.

వెంటనే ఎవరో అరిచారు "ఇది ఆశయ్యది!" అని

అలా అన్నది ఎవరో కాదు. ఆశయ్య తమ్ముడే. ఆశయ్య వేసుకున్న దుస్తుల్ని పట్టి గుర్తించాడు.

జనమంతా విస్తుపోయారు.

చనిపోయిన ఆశయ్య ఎంత దుర్మార్గుడైనా ఆ క్షణంలో కంట తడిపెట్టని వారు లేరు.

అప్పటికే సాయంకాలం ఘడియలు దగ్గర పడుతున్న మూలంగా ఆశయ్య తమ్ముడు, పెద్ద లందరూ కలసి దహన కార్యక్రమం ప్రారంభించారు.


** ** **

మరునటి రోజు ఊరి పెద్దల ముందు సమావేశ మయ్యారు జనం.

"ఆశయ్య చనిపోవడం చాలా విచారకరంగా ఉంది" అన్నాడు ఓ పెద్ద మనిషి.

"గురవయ్య స్వామే ఆశయ్యను చంపివేశా డేమో?" అంటూ నసిగాడు ఆశయ్య తమ్ముడు.

"నిజమే! కొండ మీద ఉన్న నిధి నిక్షేపాలు త నొక్కడే అనుభవించా లనే దురాశతో ఆశయ్యను



**పుట్టినరోజు**

సునీల్: అనిల్, నీ పుట్టిన రోజు ఎప్పుడు?
అనిల్: ఏప్రిల్, 18
సునీల్: ఏ సంవత్సరం?
అనిల్: ప్రతీ సంవత్సరం.

బి.ఎస్.[రాజమండ్రి]

చంపేసి ఉంటాడు గురవయ్య" అన్నారు కొందరు కుర్రకారు.

"గురవయ్య స్వామి ఇటువంటి అకృత్యాని కెప్పుడూ పాల్పడడు" అని ఇద్దరు ముగ్గురు పెద్ద లన్నారు.

"పోలీసులకు ఫిర్యాదు చేసి గురవయ్యను ఎలాగైనా వట్టించాలి" అన్నారు కుర్రకారంతా ఉమ్మడిగా.

"నిజమే, అప్పు డసలు సంగతి బయటపడుతుంది" అని అక్కడ చేరి జనంలో చాలామంది పైకి అనడంతో పోలీసు ఫిర్యాదు ఇవ్వాలని నిర్ణయించారు.

అలా నిర్ణయించిందే తడవుగా, ఆశయ్య తమ్ముడితో సహా ఓ పదిమంది బయలుదేరి ఊరికి ఇరవైమైళ్ల దూరంలో ఉన్న తాలూకా పోలీసు స్టేషనులో ఫిర్యాదు ఇచ్చారు.

మరునటి రోజు ఓ ఆఫీసరుతో సహా అరడజనుమంది పోలీసులు వచ్చారు ఊరికి జీపులో. వచ్చిన పోలీసు ఆఫీసరు ఊరి పెద్దను పిలిచి -

"చావు విషయంలో అనుమానం కలిగినప్పుడు శవాన్ని దహనం చేయకుండా పిలిపించాల్సింది మమ్మల్ని మీరు" అని కొంచెం వినుగ్గానే మాట్లాడాడు.

దాంతో ఆ ఊరి పెద్ద లందరకూ కోపం వచ్చి - "వాడి కర్మ కొద్దీ కొండ మీద నుంచి జారి పడిపోయా డనే అందరం అనుకున్నాం. అందుకనే ఊరందరి సమక్షంలో ఆశయ్య తమ్ముడు శవాన్ని దహనం చేశాడు. ఆ తర్వాత ఊళ్లో జరిగిన సమావేశంలో కొందరు అనుమానాలు లేవదీసి మీకు ఫిర్యాదు చేస్తే మంచి దనడం వల్ల ఫిర్యాదు చేశాం" అని గట్టిగానే అన్నారు.

అంతవరకూ జరిగిన విషయ మంతా అడిగి తెలుసుకున్న తర్వాత "ఇప్పుడు గురవయ్య కోసం గాలించాలి" పోలీసులకు ఆదేశ మిచ్చాడు ఆఫీసరు.

కాని ఆ కొండ మీద ఎక్కడానికి పోలీసులు కూడా సందేహించి ముందర చుట్టుపక్కల పరిసరాలు గాలించా లని నిర్ణయించుకుని నలుగురూ నాలుగు వైపులకూ బయలుదేరారు.

ఆఫీసరుకు మాత్రం ఓ చెట్టు నీడన పడ క్కుర్చీ ఏర్పాటు చేశారు.

మధ్యాహ్నానికల్లా దక్షిణ దిశగా వెళ్లిన ఓ పోలీసు రొప్పుకుంటూ వచ్చి, "సార్! కొండకు ఆ వైపు ఓ శవం ఉంది, సార్!" అని విన్నవించుకున్నాడు.

వెంటనే అక్కడున్న యావన్మందీ బయలుదేరి పోలీసు చూపించిన స్థలానికి చేరుకున్నారు.


నిజంగానే అక్క డో శవం ఉంది. మర్రి చెట్టు కొమ్మ నుంచి వేల్లాడుతోంది.

ఆ శవాన్ని చూడగానే జనం ఒక్కసారిగా గొల్లు మన్నారు. శవం గురవయ్య స్వామిది!

ఎన్నో సంవత్సరాలుగా ఊళ్లో ప్రతి మనిషినీ చిరునవ్వుతో పలకరించిన గురవయ్య స్వామి శవం కూడా ఎంతో ప్రశాంతమైన ముఖంతో అక్కడకు వచ్చిన జనాన్ని ప్రతివారినీ పేరు పేరునా చిరునవ్వుతో పలకరిస్తున్నట్లే అనిపించింది అందరికీ.

కొమ్మ నుంచి తాడుని తెంపి పోలీసులు శవాన్ని కిందకు దింపి, నేల మీద పడుకోపెడుతున్నప్పుడు గురవయ్య స్వామి కట్టుకున్న పంచె ఊడి ఓ పాకెట్టు కింద పడింది.

అందరి సమక్షంలో ఆ పాకెట్టును పోలీసులు తెరిచి దానిలో సుగంధం వెదజల్లుతున్న విభూతితోపాటు, ఓ ఉత్తరం కూడా కనిపించింది. ఆ ఉత్తరాన్ని ఊరి పెద్దకు




ఇచ్చి పైకి చదవమని పోలీసు ఆఫీసరు సలహా ఇవ్వడంతో ఊరి పెద్ద మొదలెట్టాడు.


"కొండా పురం ప్రజలను గురవయ్య దీవించి రాయునది.

"కొండ మీద ఏవో నిధి నిక్షేపా లున్నా యనుకుని, వాటిని పొందా లనుకుని మీ రందరూ ఆరాటపడిపోయారు. నిజానికి కొండ మీద బంగారు నిధి నిక్షేపాలు ఏ మాత్రం లేవు. అవి మీలోనే ఉన్నాయి. మీ అందరిలోనూ ఉన్నాయి. అవే ప్రేమ, శాంతి, సహనం, తృప్తి. వాటిని వెలికి తీయండి. మీ రెంత తీసినా తరగని నిధు లివే. మీకు బంగారమే కావాలనుకుంటే కష్టపడి శ్రమిస్తే మీరు నిలబడ్డ నేలలోనే పండుతుంది!."

ఆ మాటలు స్వయానా గురవయ్య స్వామే మాట్లాడుతున్న ట్లనిపించింది అక్కడ చేరిన జనానికి.

మళ్లీ చదవడం మొదలెట్టాడు ఉత్తరాన్ని ఊరి పెద్ద.

"మీలో కొంద రనుకున్నది నిజమే. ఆశయ్యను కొండ మీద నుంచి నేనే పడతోశాను. ఆశ్చర్యంగా ఉంది కదూ! దుర్మార్గు డని తెలిసి కూడా నా చేయూత నిచ్చి,



**పూర్వం**

"సార్! పూర్వం కరెంటును కనిపెట్టకముందు పూర్వీకులు దీపాలు ఏ విధంగా వెలిగించుకునేవారు సార్."

"దీపాల్లో కిరోసిన్ పోసి వెలిగించుకునేవారు రాజూ."

"మరైతే ఆక్సిజన్‌ని పద్దెనిమిదవ శతాబ్దంలోనే కదా కనిపెట్టింది. మరి అంతకు ముందు పూర్వీకులు ఏం పీల్చేవారు సార్."

! !...?...??

భోశ్రీ [హైదరాబాద్]

ప్రోత్సహించి కొండ ఎత్తుకు తీసుకుపోయాను ఆశయ్యను. అంత ఎత్తుకు తీసుకుపోయాను కాబట్టే అంత ఎత్తు నుంచి పడదోయ గలిగాను. ఆశయ్యకూ ఆశయ్యలాంటి వ్యక్తులకూ ఇదే సరైన శిక్ష. దుర్మార్గులనూ, కిరాతకులనూ ప్రోత్సహిస్తూనే ఎత్తుకు ఎగబ్రాకించటంలో విధి అంతర్య మిదే. ఈ కార్యం నా చేతుల ద్వారా మీ అందరి శ్రేయస్సు కోసం జరగటం నా అదృష్ట మనే భావిస్తున్నాను."

ఆ మాటలకు అక్క డున్న జనం ఆశ్చర్యపోతూ నిట్టూర్పు విడిచారు. మళ్లీ ఉత్తరం చదివాడు ఊరి పెద్ద.

"మరి నే నెందుకు చనిపోయా నని కదూ, మీ అనుమానం? నా స్వార్థం కోసమే నేను ఆశయ్యను చంపి ఉంటా నని మీలో కొంద రనుమానించడం నాకు తెలుసు. నేను బ్రతికే ఉంటే నా మీద మీలో కొందరి కున్న అనుమానం ఇంకా బలపడేది. జరిగిన ఈ కార్యంలో నా కెలాంటి స్వార్థం లేదని మీకు పూర్తి విశ్వాసం కలగటానికి నా కి దొక్కటే మార్గం."

ఆ మాటలకు అందరి కళ్లలోనూ నీళ్లు తిరిగాయి.

"చివరి మాట! ఇన్నాళ్లు నాకు ఆశ్రయ మిచ్చిన ఈ బంగారు కొండ మీ ఆశలకు, ఆశల మూలంగా మీలో చెలరేగిన అశాంతికి ప్రతిరూపంగా నిలిచిపోతుంది. ఈ ఆశల కొండ దరిదాపులకు రానంతవరకూ మీ జీవితాలు సుఖమయంగా ఉంటాయి. మీ రెంత దూరంగా ఉంటే అంతగా మిమ్మల్ని కాపాడుతుం దీ కొండ.

"మిమ్మల్ని సదా ప్రేమించే గురవయ్య."

ఆ మాటలు వింటూ పోలీసులు కూడా కంట తడిపెట్టుకున్నారు. వారికి తెలియకుండానే వారి చేతుల్లోంచి తుపాకులు జారిపోయాయి నేలమీదకు. జన మంతా గురవయ్య స్వామి పాదాలను కళ్లకద్దుకున్నారు భక్తి గౌరవాలతో.

"అదీ, తల్లీ! ఈ కొండ అసలు కథ" అని పాలేరు రామయ్య వివరంగా చెప్పేటప్పటికి నాకు తెలియకుండానే నా కళ్లూ చెమ్మగిల్లాయి.

ప్రతిరోజూ కొండకు దణ్ణం పెడుతూనే ఉన్నా కొండ దరిదాపులకు పోవా లనే ఆలోచన మళ్లీ కలగలేదు.

★